# కథ

-మోర్తల ప్రభాకర్ రెడ్డి

# అదీ సంగతి!

**జంబులింగం ఛటుక్కున లేచి కూర్చున్నాడు. గొంతులో మంట..చమటలు పడుతున్నాయి. ఛాతిలో సూదులతో పొడుస్తున్నట్టు నొప్పి. కంగారెక్కువైంది. ఏదో ప్రెషర్..అతను ఆల్‌రెడీ బీపీ పేషంట్. లోకల్ టాక్సులు అదనంలా ముప్ఫైకిలోల బరువొకటి.**

తెల్లవారుఝామున నాలుగున్నర అయ్యింది. ఆ టైంలో హార్ట్‌ఎటాక్‌లు ఎక్కువని చదివిన గుర్తు. మళ్ళీ ఛాతిలో చురుక్కుమంది..బాబోయ్!

"శబరీ..శబరీ" గాభరాగా అరిచాడు. సదరు శబరి అనబడే అతని భార్యారత్నం, కొత్తరకం ఆసనం వేస్తున్నట్టు కాళ్ళూ చేతులూ బార్లాచాపి మంద్రగబ్బలా నోరు తెరిచి, కుక్కర్ విజిల్‌లా రిథమిక్‌గా గుర్రుపెడుతూ కనిపించడంతో జంబులింగానికి, గుండెతోపాటు కడుపునిండా విపరీతంగా మండి ఏనుగు తొండం లాంటి చేత్తో ఆమె నడుం మీద నిమిరాడు. దాంతో శబరి..రామా! బదులు వామ్మో!..వాయ్యో! అంటూ ఛెంగున లేచి కూర్చుంది.

"అబ్బ అర్ధరాత్రి అంకమ్మ శివాలన్నట్టు..మీకు వేళా పాళా లేదా..ఛాల్లెండి మీ సరసం" అంది నిద్ర అనే సమాధిలోకి మళ్ళీ వెళ్ళబోతూ.

"నీ బొంద..ప్రాణభీతితో నేను హడలి ఛస్తుంటే నీకు సరసంలా ఉందా" అంటూ తన బాధలో మూడుపాళ్ళు ఆమెకి ట్రాన్స్‌ఫర్ చేసాడు.

ఈసారి శబరి మానసికంగా కూడా కళ్ళు తెరిచింది. భర్త బాధని అర్థం చేసుకుని "అబ్బా...అది గుండెనొప్పి అయ్యుండదేమో, గ్యాస్ అయ్యుంటుంది. రాత్రి వారిస్తున్నా వినకుండా రేపే చచ్చిపోబోతున్నట్లు ఆరుపెగ్గుల విస్కీ, అరకిలో చికెన్, కిలోమటన్ బిర్యాని తింటిరి..ఉండండి ఈనోసాల్ట్ తెస్తాను" అంటూ లేవబోయింది.

సడన్‌గా జంబులింగానికి దబ్బనంతో గుండెల్లో పొడిచినట్లయి 'అబ్బా' అని అరిచాడు. బాధతో ఛాతీని పిండుకోసాగాడు. దాంతో శబరికి కూడా ఖంగారులాంటిది కాస్త కలిగి గబగబా పక్కరూంలో ఓండ్ర పెడుతున్న స్టుపిడ్ అప్పారావుని నిద్రలేపింది. "ఎక్కడికో బయలుదేరారిద్దరూ.." అంటూ వెర్రి ప్రశ్నతోపాటు దానికి మ్యాచింగ్ నవ్వొకటి చేర్చాడు స్టుపిడ్ అప్పారావు.

"మీ బావకి గుండెనొప్పిగా ఉందిరా..త్వరగా వెళ్ళి ఏదైనా ఆటో పట్రా"

"ఏ హాస్పటల్‌కని చెప్పాలి? మీటర్ మీద ఎక్స్‌ట్రా అడిగితే ఎంతిస్తామని చెప్పాలి?"

జంబులింగం "ఆస్తంతా రాసిస్తామను. ముందువెళ్ళి ఆ ఆటో తీసుకురా వెధవా" అని కోపంగా అరిచేసరికి..ఏదో గొణుక్కుంటూ అప్పారావు వెళ్ళిపోయాడు.

పావుగంట తర్వాత ఆటో 'ఫాదర్ భరోసా' హాస్పిటల్‌లో ఆగింది. రిసెప్షన్ దగ్గరికి వెళ్ళీ వెళ్ళకముందే "ముందు పదివేలు కట్టండి" అందో నర్స్.

"కడతాం..ముందు..ఆయనకి అకస్మాత్తుగా గుండెల్లో నొప్పి" అంటూ శబరి ఏదో చెప్పబోతున్నా వినిపించుకోకుండా నర్స్ రోబోలా 'పదివేలు కట్టండి..పది..వేలు' అంటూ మళ్ళీ మొదలెట్టింది.

"అబ్బ యిచ్చెయ్ అక్కా..బావ బ్రతికి బట్టకడితే మనకదే పదివేలు" అంటూ నర్స్‌కి వంతపాడాడు అప్పారావు.

అతనేదో వొట్టిమనిషి కూడా కాదన్నట్టు జంబులింగాన్ని, కన్సల్టేషన్ రూంలోకి నడిపించుకు పోయిందో నర్సు. ఆ తర్వాత బీపీ చెక్ చెయ్యాలని, కఫ్ క్లాత్‌ని జంబులింగం చేతికి కట్లపాములా చుట్టి, గిన్నెలకి కళాయి పెట్టేవాళ్ళలా తుస్సు..బుస్సు..అంటూ గాలి కొట్టసాగింది. కాసేపట్లో రక్తప్రసరణ ఆగిపోయి..చేతికి పక్షవాతం వస్తుందనగా చాలించి జంబులింగానికి తాత్కాలికంగా ప్రాణభిక్ష పెట్టింది. ఆ తర్వాత బాబోయ్ హైబీపీ..రెండు వందలూ బై నూట ఇరవై..చాలా ప్రమాదం..అంటూ పక్క రూంలోకి పరిగెత్తి, పాతికవేలు లంచం యిస్తేగానీ 'డాక్టరు' అని పిలవరు ఎవరైనా అనేలాగున్న ఓ 'కళ్ళు చిదంబరం'తో వచ్చింది.

ఆ డాక్టర్ శబరితో అప్పారావు వైపు చూస్తూ.."పేషంట్‌ని అంత నిర్లక్ష్యంగా వొదిలేస్తారా? కనీసం స్ట్రెచర్ మీద పడుకోబెట్టాలని కూడా మీకూ అనిపించలేదా? ఫోన్లే..నేనొచ్చాను. ఇక మీకేం భయంలేదు" అంటూ అప్పారావుని స్ట్రెచ్చర్ ఎక్కించబోయాడు. "డాక్టర్" అని జంబులింగం బాధగా మూలిగాడు. "వాట్..మీరు పేషంటా? గుండ్రాయిలా ఉంటే..నేను పొరబడ్డాను. సర్లే..ఎవరైతే నాకేంటి? నర్స్..ఈయనకి గౌను తొడగండి.." అంటూ వెళ్ళిపోయాడు.

కొంపదీసి పౌడరు కూడా రాసి బొట్టుపెడతారేమోనని జంబులింగం ఖంగారుపడసాగాడు. నర్స్ వెంటనే ఓ చింకి గౌనుతో వచ్చింది. అది వేసుకోవడం సంగతి అటుంచీ, దాన్ని తాకితేనే డజను అంతుబట్టని వింతరోగాలు రావడం గ్యారంటీ అన్నట్టుంది.

నెలల నిండిన ప్రెగ్నెంట్ ఎలుగ్గొడ్డులా వున్న జంబులింగం చెయ్యి కూడా అందులో దూరలేదు. పావుగంట గాలించి, అన్నిటికన్నా పెద్ద సైజుది పట్టుకొచ్చారు. అది సగం సరిపోయింది. దాంతో ప్రజాక్షేమం దృష్ట్యా జంబులింగం ముందు భాగం కవర్ చేసి క్లబ్ డ్యాన్సర్‌లా బ్యాక్ ఓపెన్ పెట్టారు. జంబులింగం ఎలాగో స్ట్రెచ్చర్ ఎక్కాడు. ఇద్దరు నర్సులు దాన్ని నెట్టబోయి..పట్టుదప్పి తూలి బోర్లాపడి పళ్ళ డాక్టర్‌కి పనికల్పించారు. నోటినిండా రక్తంతో రక్తపిశాచాల్లా ఉన్నారు వాళ్ళు. వార్డ్‌బోయి బైటికి పరిగెత్తి నలుగురు కూలీలని పట్టుకొచ్చాడు. ఒక్కోరికి వంద కూలీ అని ఆశపెడితే వాళ్ళయినా వచ్చారు.

'హైలెస్సా! ఓ లెస్సా' అని శ్రమ తెలియకుండా పాడుకుంటూ వాళ్ళు జంబులింగాన్ని ఇసిజి రూంలోకి నెట్టుకెళ్ళారు. అక్కడెవరూ లేరు. నాలుగు రూంల అవతల పేకాడుతున్న ఇసిజి ఆపరేటర్‌ని, ఓ నర్సు వాళ్ళమీద జాలిపడి తీసుకొచ్చింది. అతను చిటపటలాడుతూనే వచ్చాడు.

మొత్తానికి ఎలాగో ఇసిజి తీసారు. దాన్నిచూసి ఆ ఆపరేటర్ పెదవి విరిచి, నిర్లక్ష్యంగా నర్స్ చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.

"ఏమైంది సిస్టర్" అంది శబరి ఆదుర్దాగా.

"అబ్‌నార్మల్‌గా ఉంది..ఏదో ప్రాబ్లమ్ ఉంది. డాక్టర్‌గారిని పిలుస్తాను" అంటూ ఇసిజితో వెళ్ళిపోయింది.

రెండు నిముషాల తర్వాత కళ్ళు చిదంబరం ఖంగారుగా వొచ్చి "వెంటనే సి.టి.కార్డియెక్ ఆంజియో తీయాలి. క్విక్" అని కార్డియోలజీ చీఫ్‌తో మాట్లాడ్డానికి వెళ్ళిపోయాడు. వెంటనే నర్సు "పది వేలు..పది..వేలు" అంటూ రికార్డ్ డ్యాన్స్ చేయసాగింది.

శబరికి ఖంగారెక్కువైంది. "తమ్ముడూ..వెంటనే సుమతిని వాళ్ళాయన్ని రమ్మని చెప్పు..ఆ...అన్నట్టు. పాతికో ముప్ఫై వేలో ఎంతుంటే అంత పట్రామను..వెళ్ళు" అంది.

ఇదే సందు..అదే మందన్నట్టు హమాలీలూ..మరో యాభై యిస్తేనే..స్కానింగ్ రూంకి శాల్తీని తీసుకెళతామని పేచీ పెట్టారు.

స్కానింగ్ రూంలో..జంబులింగాన్ని స్ట్రెచ్చర్ మీద నించి ఓ అర అడుగు వెడల్పాటి మరో స్ట్రెచ్చర్‌లాంటి దాని మీదికి ఎలాగో చేర్చారు. జంబులింగం ముప్పాతిక బాడీ బైటికే వుంది. హార్ట్ ఎటాక్‌తో పోతాననే దిగులుకన్నా..అక్కడ్నుంచి పడి..వెన్నుపూస విరగొట్టుకుని శాశ్వతంగా మంచానికే అతుక్కుపోతానేమోనని భయం పట్టుకుంది. సి.టి.మెషిన్ కిందకి అతన్ని చేర్చడం కుదరలేదు. భుజాలు, చేతులు అడ్డువస్తుండడంతో, ఆఖరి ప్రయత్నంగా, అతనేదో చంబల్ వ్యాలి బందిపోటన్నట్టు..చేతులూ, రెక్కలూ విరిచి వెనక్కి కట్టి ఎలాగో తతంగం పూర్తి చేసారు.

కార్డియాలజీ చీఫ్‌కి ఇ.సి.జి, సి.టి.స్కాన్ రిపోర్ట్ చూపించారు. దాన్ని ఆయన శల్యపరీక్ష చేసి పెదవి విరుస్తూ "దిస్ ఈజ్ ఏ కేస్ ఆఫ్ కార్డియో టప..టపా కటేమియా" అన్నాడు, కళ్ళు చిదంబరంతో.

"మా బావకి ఏమైంది డాక్టర్?" కుతూహలంగా అడి

గాడు అప్పారావు.

"విన్నారుగా..ఈ జబ్బు చాలా అరుదైంది. లక్షల్లో ఒక్కరికి వస్తుంది" అని జంబులింగం చాలా అదృష్టవంతుడైనట్టు గర్వంగా చెప్పాడు చిదంబరం.

"కాస్త స్పెల్లింగ్ చెబుతారా డాక్టర్..ఎవరైనా అడిగితే కరెక్ట్‌గా చెప్పడానికి" అని అప్పారావు అనగానే..

నాలుగుసార్లు గుటకలు మింగి ..ఏదో అనేంతలో ఐ.సి.యు నుంచి కబురొచ్చింది..అక్కడ్నుంచి హడావిడిగా వెళ్ళిపోయి పరువు కాపాడుకున్నాడు.

మరో యాభైకి ఎగ్రిమెంట్ చేసుకుని, హమాలీలు జంబులింగాన్ని ఐసియులోకి నెట్టుకుపోయారు.

అక్కడి పరిస్థితి చూసి జంబులింగం కళ్ళు తేలేసాడు.

ఓ బెడ్‌మీద ఓ శాల్తీ శవంలా పడుంది. అతని మొహం అంగుళం కూడా కనబడకుండా అన్నీ పట్టీలు. నోట్లో ముక్కులో చెవుల్లో కూడా రకరకాల గొట్టాలు..నీళ్ళు తోడుతున్నట్టు చిత్రమైన శబ్దాలు.

మరొకరెవరో..కప్పలా ఎగిరెగిరి పడుతున్నారు. అతన్ని నలుగురు కదలకుండా పట్టుకుని ఉన్నారు. ఒక నర్సు..ఏవో ప్యాడ్స్‌లా వున్నవి అతని రొమ్ము మీద పెట్టడం..అతను ఎగిరిపడడం చూసి జంబులింగానికి వాళ్ళంతా అతన్ని చంపుతున్నారో, రక్షిస్తున్నారో అర్థం కాలేదు.

మరో బెడ్‌మీదున్న పేషంట్‌కి అమర్చిన అన్ని ట్యూబ్‌లూ పరికరాలూ తీసేస్తున్నారు. అతనిమీద ఓ తెల్ల దుప్పటి నిండుగా కప్పారు. "మాయదారి జబ్బు..గంట క్రితం వరకూ బాగానే ఉన్నాడు. పొద్దున్నే డిశ్చార్జ్ అని కూడా డాక్టర్‌గారు చెప్పారు..ఇంతలోనే..." అంది జంబులింగం తలగడ సరిచేస్తూ ఓ నర్సు.

"అతనికేం అయ్యింది..సిస్టర్" అడిగాడు జంబులింగం.

"మీకొచ్చినదే" అంటూ మరో మాటకి అవకాశం లేకుండా ఆమె వెళ్ళిపోయింది..

సడన్‌గా జంబులింగం గుండె..నలభై బీట్స్ ఎక్కువ కొట్టుకోసాగింది.

ఐసియు హెడ్‌నర్స్ వచ్చి అర్జెంటుగా ఓ ఇంజక్షన్ తెప్పించమని శబరికి ఓ చీటీ యిచ్చింది. "ఆయన పరిస్థితి బాగోలేదు అర్జెంట్" అంటూ విసవిసా వెళ్ళిపోయింది.

అప్పారావు ఐదువేలు కట్టి ఇంజక్షన్ పట్టుకొచ్చాడు.

సుమతీ, ఆమె భర్త రామాచారి ఖంగారుగా వొచ్చారు. డబ్బు కట్టడానికి వెళ్ళిపోయాడు అప్పారావు. రామాచారి ఆర్.ఎం.పి. డాక్టర్ ఓ స్లమ్ ఏరియాలో. అతని ప్రాక్టీసు ఎయిడ్స్ వ్యాధిలా రోజు రోజుకి పెరుగుతూ ఆశాజనకంగానే వుంది.

ఇంజక్షన్ యిచ్చామని..అరగంటలో పరిస్థితి కుదుటబడకపోతే ఆపరేషన్ తప్పదని, రెండు లక్షలు రెడీ చేసుకోమని తుపాను హెచ్చరిక లాంటిది చేసి మాయమయ్యాడు.

శబరి శోకాలు మొదలెట్టింది. సుమతి అక్కని ఓదార్చుతూనే తనూ సాయంగా ఏడవసాగింది. రామాచారి వాళ్ళకి ధైర్యం చెప్పి చొరవగా ఐసియులోకెళ్ళాడు. జంబులింగాన్ని తేరిపార చూసి అనుమానంగానే పక్కనున్న అతని కేస్ షీట్ తీసి చూసాడు. ఇసిజి స్ట్రిప్ పరీక్షగా చూసి నమ్మలేనట్టు నోరు తెరిచాడు. ఆ తర్వాత సిటి స్కాన్ కూడా చూసి "డాక్టర్" అని అరిచాడు.

చీఫ్ కార్డియాలజిస్టు బుద్ధావతారం వచ్చి విసుగ్గా చూస్తూ "ఏంటా అరుపులు" అన్నాడు.

"డాక్టర్ నాకు ఈ ఇసిజిలో పొరపాటు జరిగిందనిపిస్తోంది. ఇది లోఓల్టేజీలో తీసారనుకుంటా" అంటూ బుద్ధావతారానికి అందించాడు. అతను కాసేపుచూసి అయిష్టంగానే తలూపి "అయినా సిటిస్కాన్‌లో ఈ తెల్లటి ఏరియా చూడండి...సివియర్ కాల్సిఫికేషన్" అంటుండగా..రామాచారి ఆ సి.టి.స్కాన్ ఫిల్మ్‌కు అంటుకున్న చాక్‌పీస్ పొడిని తుడిచాడు. బుద్ధావతారం నోరెళ్ళబెట్టాడు.

పాతికవేలు అనవసరంగా 'ఫాదర్ భరోసా' హాస్పిటల్‌కి సమర్పించుకుని అంతా ఇంటికి బయలుదేరారు.

ఆటో ఎక్కుతూ "అబ్బా!" అని మళ్ళీ అరిచి ఛాతీ పట్టుకున్నాడు జంబులింగం. మిగతా అంతా మళ్ళీ అయోమయంగా చూస్తుండగా, రామాచారి ఓ క్షణం ఆలోచించి జంబులింగం చొక్కా జేబులో చెయ్యి పెట్టి కాసేపు గెలికి, ఓ టూత్ పిక్ తీసాడు. అసలు కథకి సూత్రధారి ఆ టూత్‌పిక్ అని తెలియడంతో జంబులింగం నోరెళ్ళబెట్టాడు.

పాతికవేలు తగలేయించినందుకు శబరి దండకం మొదలెట్టింది. ఆ తిట్లకి జంబులింగానికి మళ్ళీ గుండెల్లో ఎక్కడో నొప్పి మొదలైంది.

☆

